ఈ వారం సరసం

# వయసు-మనసు

– కొలపల్లి ఈశ్వర్

తలస్నానం చేసాక తలతుడుచుకుంటూ బాత్‌రూమ్‌లో నుండి సిటవుట్‌లోకి వచ్చిన రాజశేఖర్ అటుచూసి అలాగే నిలబడిపోయాడు, రెప్పవాల్చకుండా అటే చూడసాగాడు.

తమ ఫ్లాట్‌కి సరిగ్గా ఎదురు ఫ్లాట్‌లో దిగిన ఆమె....ఆమె రేణుకనే కదూ?!...యస్! రేణుకనే!... ఆమెను పోల్చుకోవడంతోనే అతడికి కలిగిన ఆనందం కొద్దిక్షణాల పాటు తనువంతా పులకరించిపోయేలా చేసింది.

అతడు ఆమెను పరిశీలనగా చూసాడు. ఈ మూడేళ్లలో రేణుక కాసింత లావయింది. అయితేనేం ఆ లావు ఆమెను మరింత అందంగా కనబడేలా చేస్తోంది. ఇప్పుడు రేణుక పరిపూర్ణ ఆకృతికి చక్కని నిదర్శనంలా మారింది.

రాజశేఖరం మనసు ఎక్కడికో వెళ్లిపోయింది. నిముషంలోనే ఆ మనసు ఏవేవో ఊహించేసింది. ఆక్షణం అప్రయత్నంగానే అతడి నోటివెంట ఏదో సినిమా పాట 'హమ్' చేయడం మొదలయింది. అప్పుడు అలా 'హమ్' చేస్తూనే రేణుక కంటపడేందుకు నకల విధాలా ప్రయత్నించాడు గానీ, ఆ ప్రయత్నాలు ఫలించలేదు.

సరిగ్గా అప్పుడే హాలులోనుండి స్రవంతి కంఠం కాస్త పెద్దగానే వినిపించింది "ఏమండోయ్! కాఫీ చల్లారిపోతుంది కాస్త త్వరగా రండి".

అతడు ఉలిక్కిపడి తలతిప్పకుని హాల్లోకి నడిచాడు.

స్రవంతి హాల్లో సోఫాలో కూర్చుని కాఫీ తాగుతుంది. మరో కప్పు తనకోసమే కాబోలు టీపాయ్‌మీద పెట్టబడి వుంది. అతడు కాఫీ కప్పు అందుకుని ఆమెపక్కనే సోఫాలో కూర్చున్నాడు.

"మీరు కాస్త త్వరగా తయారవ్వండి. నిన్నకూడా నేను ఆఫీసుకెళ్లేసరికి రిజిస్టర్ మేనేజర్ రూంలోకెళ్లిపోయింది. తరచుగా ఇలా ఆలస్యమయితే ఎలాగమ్మా? అని మేనేజర్ చీవాట్లు..."

తను ఆమె పక్కన కూర్చోగానే మొదలయిన దండకం విని రాజశేఖరం మనసు అదోలా అయిపోయినా, ఆ ఫీలింగ్ ముఖంలో కనిపించకుండా నవ్వి "అలాగే. ఈ రోజు త్వరగానే బయల్దేరుదాంలే" చెప్పాడు.

అతడూ కాఫీ తాగడం పూర్తిచేసాక, స్రవంతి రెండు కాఫీ కప్పులూ తీసుకుని కిచెన్‌లో కెళ్లిపోయింది. స్రవంతి కిచెన్ వైపు అడుగేయడంతోనే అతడు ఒక్క గంతులో సిటవుట్‌లోకి వచ్చి అటు చూస్తే రేణుక కనిపించలేదు. ఏదో పనిమీద సిటవుట్‌లోకి వచ్చిన ఆమె హాల్లోకి వెళ్లిపోయింది.

రాజశేఖర్ మనసు 'మన్మధరాగం' ఆలపించసాగింది. అసలు...అసలీ జీవితంలో మళ్లీ రేణుక తనకు కనిపించదనుకుంటే, ఇప్పుడిలా హఠాత్తుగా, అతిదగ్గరగా ప్రత్యక్షం కావడం అతడు ఉక్కిరిబిక్కిరయిపోతున్నాడు. ఆ ఆనందం అతడి కాళ్ళు నేలమీద నిలవనీయకుండా చేస్తోంది.

ఆక్షణం అతడికి రేణుకతో తన పరిచయం కనులముందు కదలాడింది.

మూడేళ్ల క్రితం-అప్పట్లో 'సిరాత' అనే కాస్మోటిక్స్ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తుండేవాడు. రేణుక ఆ ఆఫీసులో స్టెనోగా పనిచేసేది. ఆమెతోనే తనకు ఎక్కువగా అవసరపడేది. మార్కెటింగ్ సంబంధించి ఎక్కువగా లెటర్స్ డిక్టేట్ చేయవలసి వచ్చేది. అందువల్లే రేణుక తన ఛాంబర్‌లోనే ఎక్కువసేపు గడిపేది. అప్పటికే తనకు పెళ్లై ఆరేళ్లయింది. తన భార్య స్రవంతికి బ్యాంక్‌లో ఉద్యోగం. స్రవంతి మంచి అందగత్తే. అయితేనేం, ఈ ప్రపంచంలో ఎక్కువశాతం మంది మగాళ్లకున్న బలహీనతే అది. ఇంట రంభ వంటి ఇంతి ఉన్నప్పటికీ, పరాయి ఆడదాని పొందుకోసం తాపత్రయం మగవాళ్ల నైజం! ఆ నైజమే తనను రేణుకతో చనువుగా మసలుకునేలా చేసింది. ఆఫీస్ అవర్స్ అయిపోయాక, బయట ఎక్కడో కలుసుకోవడం, సినిమాలు-షికార్లకు వెళ్లడం జరిగేది.

అయితే ఎందుకనో ఆ వ్యవహారం అంతకుమించి ముందుకు సాగకుండా ఆగిపోయింది. ఎప్పడైనా తను ఆమెను అందుకోసం బలవంతపెడితే, ఏదో కారణం చెప్పి తప్పించుకునేది. అంతలోనే తనకు మరో కంపెనీ నుంచి మంచి ఆఫర్ రావడంతో ఆ కంపెనీ వదిలేసాడు. అప్పటినుంచి రేణుక తనకు అసలు కనిపించలేదు. ఇదిగో...ఇప్పుడు... ఇలా.. అప్పట్లో తనకు పెళ్లయిపోయినట్టుయింది.

అప్పట్లో బహుశా తను కన్నెపిల్ల అన్న భయంతో కాస్త భయపడి ఉండొచ్చు. కాని ఇప్పుడు తనకు పెళ్లయిపోయింది. కాబట్టి...భయం వుండదు. ఇప్పుడు ఆ కార్యక్రమానికి పెద్దగా అడ్డు చెప్పకపోవచ్చు...

"ఏమండోయ్! మళ్లీ అక్కడికెళ్లి ఏం చేస్తున్నారు?"

స్రవంతి అరుపు అతడు ఈలోకంలోకి వచ్చేలా చేసింది.

"ఏం లేదోయ్! వచ్చేస్తున్నా" అతడు తిరిగి హాల్లోకి వెళ్లిపోయాడు.

అటుచూస్తే-టీపాయ్ మీద రెండు టిఫిన్ బాక్స్‌లు రెడీగా వున్నాయి. స్రవంతి బ్యాంక్‌కి వెళ్లేందుకు రెడీగా వుంది.

"టెన్ మినిట్! డ్రెస్ అయివచ్చేస్తాను" అతడు బెడ్‌రూమ్ వైపు వెళ్లాడు.

పది నిముషాల తర్వాత అతడు ఇవతలకు వచ్చాక "త్వరగా రండి. భోంచేసి బయల్దేరాం మనం" డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని వున్న స్రవంతి చెప్పింది.

"పెట్టేసెయ్" అతడూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

భోజనాలు ముగిసాక, టిఫిన్ బాక్స్‌లు పట్టుకుని బయల్దేరారు. అపార్ట్‌మెంట్‌కి లాక్‌చేసి లిఫ్ట్‌లో కిందికి దిగారు.

రాజశేఖర్ స్కూటర్ తీశాడు. స్రవంతి కూర్చున్నాక స్కూటర్ ముందుకు కదిలింది.

పది నిముషాల తర్వాత స్కూటర్ బ్యాంక్ ముందు ఆగినప్పుడు స్రవంతి కిందికి దిగి అతడితో అంది "సాయంత్రం నన్ను పికప్‌చేసుకునేందుకు వస్తున్నారా? లేకపోతే కాస్తముందుగా ఫోన్‌చేసి చెప్పండి నేను ఆటోలో వెళ్లిపోతాను"

"అలాగే" అన్నాడు రాజశేఖర్ మనసులో మార్గం వెతుక్కున్నాడు. నేనిప్పుడు ఆఫీసుకి ఎక్కడెళ్తున్నాను. ఈ సాయంత్రం వరకూ రేణుకతో స్వర్గసుఖాలు అనుభవించి, అప్పటికి కాస్త రిలాక్సయితే ఇటుగా వచ్చి నిన్ను పికప్ చేసుకుని వెళ్లిపోతాను. లేకపోతే

ఇంటినుండి ఫోన్ కొట్టి ఆఫీసులో చెబుతుందని చెప్పేస్తా...అయినా ఇది రేణుక భర్త ఇంటికి రావడం మీద ఆధారపడి వుంటుందిలే"

రాజశేఖర్ స్కూటర్ ముందుకు పోనించాడు. అక్కడి సర్కిల్‌లో నుంచి మరోదారిపట్టి ఇంటివైపు మళ్లాడు.

స్కూటర్ వేగంగా ముందుకెళుతుంటే, రాజశేఖర్ మనసు అంతకన్నా వేగంగా ఎదురవ్వబోయే మధురక్షణాల గురించి మనోహరంగా ఊహించేస్తుంది.

తను వెళ్లి అపార్ట్‌మెంట్ తలుపు తట్టగానే, తలుపు తీసిన రేణుక తనను చూసి ఆశ్చర్యపోతుంది "హాయ్! మీరు ఇక్కడ" అంటూ కన్ఫ్యూజ్ అయిపోతుంది.

మీ ఎదురు ఫ్లాట్‌లోనే మేముండేది. ఉదయం నిన్ను చూసాక, ఇక మనసు నిలువక ఆఫీసుకి సెలవుపెట్టి ఇలా వచ్చేసాను" అంటాడు తను.

"ఎంతకాలమయింది మిమ్మల్ని చూసి...."

అవును మనం కలుసుకుని చాలాకాలమయిపోయింది. అప్పట్లో మనిద్దరం చిలకాగోరింకల్లా, పాలునీళ్లలా కలిసిపోయి పార్కుల్లో, సినిమాలలో ఎంత ఎంజాయ్ చేసేవాళ్లమో కదా?....ఆ మధురానుభూతులు తలచుకుంటూనే ఇప్పటికీ ఈ మాత్రం ఆనందంగా గడువుతున్నాను....

"నేను కూడా...." ఆమె సిగ్గుపడుతుంది.

తను ఆమె దగ్గరగా అడుగులేస్తాడు. ఆమె తలుపేసేస్తుంది. అంతే ఒకరి కౌగిలిలో మరొకరు...ఇద్దరి మధ్యా గాలికూడా చొరబడనంత దగ్గరగా హత్తుకుపోయి, చేతులతో ఎదుటివ్యక్తి తనువులోని అణువణువూ, తడిమేస్తూ,పెదవులతో ముఖమంతా తడిచేస్తూ....

"సార్!...."

ఆ వచ్చినవాడు రేణుక మొగుడయినా ఆక్షణం పట్టించుకునేది లేదుగాక లేదు.

"సార్...." ఏదో లోకంలో వున్న తనకు ఆ పిలుపు మరోసారి వినిపించింది అతడు అయిష్టంగానే ఈ లోకంలోకి వచ్చాడు. అటు ఇటు తలతిప్పిచూస్తే తను ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వున్నాడు. తన పక్కనే ట్రాఫిక్ కానిస్టేబుల్ నిలబడి ముఖంలో ముఖం పెట్టి చూస్తున్నాడు.

రాజశేఖర్ అయోమయంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ ముఖంలోకి చూసాడు.

కానిస్టేబుల్ అదోలా నవ్వి "ట్రాఫిక్ ఇప్పటికి రెండుసార్లు క్లియరయింది సార్! తమరు మాత్రం ఆకాశంలోకి చూస్తూ మీలో మీరే నవ్వుకుంటూ, మీ వళ్లు మీరే తడిమేసుకుంటున్నారు. అందుకే ఇక్కడివరకూ వచ్చాను..." చెప్పాడు.

రాజశేఖర్‌కి సిట్యుయేషన్ అర్థమైపోయింది. అందుకే అతడు నవ్వలేక నవ్వినట్టు ఓ వెకిలినవ్వు నవ్వి చప్పన గేర్ మార్చి ముందుకెళ్లిపోయాడు.

పది నిముషాల తర్వాత అతడి స్కూటర్ అపార్ట్‌మెంట్ ముందాగింది. అతడు అడుగులు రేణుక



అపార్ట్‌మెంట్ వైపు నడుస్తుంటే గుండెల వేగం మరింతా హెచ్చింది.

రాజశేఖర్ రేణుక అపార్ట్‌మెంట్ ముందాగాడు. వణికే చేతులతో కాలింగ్‌బెల్ నొక్కాడు.

అర నిముషం తర్వాత తలుపు తెరుచుకుంది. తలుపు తెరిచిన రేణుక అతడిని చూసి ఆశ్చర్యపోయింది. ఆనందం ముఖంలో కదలాడుతుండగా "రండిసార్! రండి...." అంటూ తలుపు బార్లా తెరిచింది.

'నన్ను చూడగానే రేణుక ముఖంలో ఆనందం కనిపిస్తుందని నేననుకున్నది నిజమే' అతడు మనసులోనే సంబరపడ్డాడు.

రాజశేఖర్ లోపలికి నడిచి అక్కడే వున్న సోఫాలో కూర్చున్నాడు "మీరిక్కడ దిగి ఎంత కాలమయింది?"

"నిన్ననే" జవాబిచ్చాక ఆమె కాస్త అనుమానంగా అతడికేసి చూసింది. "అన్నట్టు మీకు ఈ ఇల్లు...?!"

"ఎదురు ఫ్లాటే మాది గంటక్రితం మా ఫ్లాట్ సిటవుట్‌లో నుంచి నిన్నుచూసాను. చాలా హేపీ ఫీలయ్యాను. అందుకే మా ఆవిడను బ్యాంక్ దగ్గర దించి, ఆఫీసుకి వెళ్లకుండా ఇలా వచ్చేసాను..."

ఆమె ముఖంలో రంగులు మారాయి.

"అంటే..."

అతడు కూర్చున్న చోటనుంచి పైకిలేచాడు, ఆమె దగ్గరగా వెళ్లి భుజంమీద రెండు చేతులు వేసి చెప్పాడు. "రేణూ! అప్పట్లో మనిద్దరం చాలా క్లోజ్‌గా తిరిగేవాళ్లం. కాని ఎందుకనో మన స్నేహం మరింతా ముందుకు వెళ్లకుండా నువ్వు అడ్డుకున్నావ్, అప్పట్లోనే భయాలు నీకు వుండివుంటాయి. కాని ఇప్పుడు నువ్వు పెళ్లయిన ఆడదానివి ఏ భయమూ అక్కర్లేదు....అందుకే...." అతడు గుటకలు మింగసాగాడు. అతడి చేతులు ఆమె భుజాలనుండి గుండెలమీదకు జారాయి.

ఆమె మేని రంగు, ఎద పొంగులు వంపుసొంపులు అతడికి పిచ్చెక్కించేస్తున్నాయి. ఆ పరిష్వాంక్షలిని గట్టిగా హత్తుకుని. ఏదో...ఏదేదో చేసేయాలనిపిస్తుంది అతడికి.

అయితే-రేణుక అదోనా నవ్వి, అతడి చేతులు పక్కకు తప్పించింది. "ప్లీజ్!కూర్చోండి" అందామె.

అతడు కొద్దిగా ఇబ్బందిగా ఫీలయ్యాడు. చప్పున ఆమె చుబుకం పట్టి తనవైపు తిప్పకుని "ఏయ్ రేణూ! నేనంటే నీకిష్టంలేదా?...."

ఆమె జవాబు చెప్పక మౌనంగా వుండిపోయింది.

"....మరి ఇష్టం లేకపోతే అప్పట్లో నాతో అంత చనువుగా ఎందుకు తిరిగావ్?" 'పడక సుఖం' తప్ప మన మధ్య మిగిలిన కార్యక్రమాలన్నీ జరిగిపోలేదా?"

రేణుక ముఖంలో నవ్వు చెదిరిపోలేదు. ఆమె అలా నవ్వుతూనే చిన్నగా నిట్టూర్చింది. "ఆడదాని వయసు-మనసుల మధ్య జరిగే సంఘర్షణ మీరు తెలియకనే ఇలా మాట్లాడుతున్నారు. అందువల్లే ఆనాటి తప్పని ఆధారం చేసుకుని ఈనాడు కూడా రేణుక తప్ప చేస్తుందనే అనుకుంటున్నారు"

"అంటే?" అర్థంకానట్టు ముఖం పెట్టి అడిగాడు రాజశేఖర్.

ఆమె చెప్పింది, "సార్! స్త్రీకయినా, పురుషడికయినా వయసనేది ఓ ఉధృత ప్రవాహం. అందులోనూ నేడు టి.వి., సినిమాలలోని బహిరంగ శృంగార కారణాన వయసు వరవడి మరింతా హెచ్చింది. ఆ వరవడిలో కొట్టుకుపోతున్నప్పుడు ఓ బలహీనక్షణా 'ఆధారం' కోసమేనన్నట్టు ఆపోజిట్ సెక్స్‌తో స్నేహం చేస్తుంది. అయితే అప్పుడే ఆమె వయసుకు-మనసుకు మధ్య సంఘర్షణ మొదలవుతుంది. ఆ సంఘర్షణలో ఒక్కోసారి వయసు-ఒక్కోసారి మనసూ గెలవొచ్చు...ఇక నా విషయానికొస్తే నేనూ ఓ బలహీనక్షణాన ఆపోజిట్ సెక్స్‌తో స్నేహం చేస్తే కలిగే చిన్నపాటి ఆనందాలను అనుభవించాలనే మీతో స్నేహం చేసాను. అంతే తప్ప....నేడు మా వారి అండ దొరికాక కూడా నా మనసుకు ద్రోహం చేసి మా వారిని మోసం చేయాలనుకోవడంలేదు...ప్లీజ్...."

రాజశేఖర్ బలంగా నిశ్వసించాడు. "నిజమే! కాలం మారింది. శృంగారం బహిరంగమయింది. యువత వయసు ప్రవాహంలో కొట్టుకుపోతూ కూడా మనసు చంపుకోవాలని అనుకోకపోవడం ఆనందపడవలసిన విషయం...ఆల్‌రైట్ రేణూ! కీపిటప్!...." అతడు మనసులోనే అనుకున్నాడు.

అప్పటికే కోరిక కరిగిపోగా, మబ్బులు తొలగిన ఆకాశంలా మారిన మనసుతో ఆమె అందించిన కాఫీ తాగి ఆఫీసుకెళ్లిపోయాడు. ●

## సూక్తులు

● తియ్యగా మాట్లాడే వాళ్ళు అసంఖ్యాకులు. కాని ప్రయోజనకరంగా మాట్లాడేవారు అరుదు!

● గొప్ప వాళ్ళలో రెండు రకాలు. ఒకటి- మంచితనంతో, మానవత్వంతో మంచి వారైనవారు. రెండవది- కేవలం డబ్బు వలన గొప్పవారైన వారు. మనిషి డబ్బుని సంపాదిస్తే 'డబ్బు' అనేది మనిషిని మార్చివేస్తుంది.

— మాలిక్

● తల్లిదండ్రుల మాట భగవంతుని ఆజ్ఞతో సమానం. పిల్లలకు వారి తల్లిదండ్రులే దైవత్వానికి వారసులు. — ప్రీవెన్‌సన

# ఆంధ్రజ్యోతి

### సచిత్రవార పత్రిక

# రంజని-కుందుర్తి అవార్డు

## 1998 కవితల పోటీ!

1984 నుంచి గత పదిహేనుళ్ళుగా ప్రతిఏటా యువకవులను, కవయిత్రులను ప్రోత్సహించేందుకు 'రంజని' ఏ.జీ. ఆఫీసు తెలుగు సాహితీ సమితి "రంజని-కుందుర్తి అవార్డు" పేరిట జాతీయస్థాయిలో తెలుగు వచన కవితల పోటీని నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం రంజని, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలతో కలసి సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తోంది.

అవార్డు వివరాలు:

అత్యుత్తమ కవితకి 1,000 రూపాయలు, యోగ్యతా పత్రం; ఉత్తమ కవితకి 500 రూపాయలు, యోగ్యతా పత్రం; పదిమంది కవితలకూ యోగ్యతా పత్రాలు.

నిబంధనలు:

కవిత ముప్పై పంక్తులకు మించనిదై, సామాజిక స్పృహ కలిగి ఉండాలి.

ఇంతవరకూ ప్రచురణ, ప్రసారం కానివి, దేనికి అనువాదం, అనుసరణ కాని వచన కవితల్ని మాత్రమే పంపాలి.

తమ పూర్తి పేరు, చిరునామా హామీపత్రంపై మాత్రమే వ్రాయాలి. కవిత ఉన్న కాగితంపై అడ్రస్ వ్రాయకూడదు.

కవితలు పంపే కవరుపై "ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, రంజని-కుందుర్తి అవార్డు 1998" అని విధిగా పేర్కొనాలి. ఎంపికైన కవితలను ప్రచురించే హక్కు రంజనిదే!

కవితలు పంపడానికి ఆఖరు తేదీ: 30.9.1998.

కవితలు పంపాల్సిన చిరునామా:

ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక,
రోడ్‌నెం.8, బంజారహిల్స్,
హైద్రాబాద్-500 034.
లేదా
కార్యదర్శి,
రంజని, తెలుగుసాహితీ సమితి,
ఏ.జీ.ఆఫీస్, హైద్రాబాద్-500004.